


# ఎల్ఆర్ఎస్ గడువు మరోసారి పొడిగింపు




- ఇప్పటి వరకు 6,393 ప్లాట్ల క్రమబద్ధీకరణ
- ప్రభుత్వానికి రూ. 25.77 కోట్ల ఆదాయం
- జిల్లాలో 25,683 దరఖాస్తులకు 19,294 ఆమోదం
- విస్తృత ప్రచారం కల్పిస్తేనే ముందుకు వచ్చే అవకాశం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్) గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. నాలుగో సారి గడువు పొడిగిస్తూ ఈ నెలాఖరు వరకు ప్రభు త్వం మరో అవకాశాన్ని ఇచ్చింది. అనధికారిక లే అవు ట్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేం దుకు ప్రభుత్వం ఇరవై ఐదు శాతం రాయితీ ప్రకటిం చినా ఆశించిన మేరకు దరఖాస్తుదారుల నుంచి స్పం దన రావడం లేదు. మొదట మార్చి నెలాఖరు వరకు గడువు విధించగా, దానిని ఏప్రిల్ 30 వరకు, ఆ తర్వాత ఈ నెల 3 వరకు పొడిగించినప్పటికీ, సాంకేతిక సమస్యల వల్ల కొన్ని ప్లాట్లు క్రమబద్ధీకరణ జరగలేదు. మున్సిపల్ అధికారుల ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడువు పొడి గించింది.

జిల్లాలో ఇప్పటి వరకు 6,393 మంది తమ ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించారు. తద్వారా ప్రభుత్వానికి 25 కోట్ల 27 లక్షల ఆదాయం సమ కూరింది. మార్చి నెలాఖరు వరకు 4,892 మంది తమ ప్లాట్లకు క్రమబద్ధీకరించుకోగా, ప్రభుత్వానికి 17 కోట్ల 45 లక్షల రూపాయల ఆదాయం సమకూరింది. నెల రోజుల్లో 1501 మంది తమ ప్లాట్లను క్రమబద్ధీకరిం చుకోగా 7 కోట్ల 82 లక్షల ఆదాయం పెరిగింది. సాంకేతిక సమస్యల కారణంగా కొందరు ఎల్ఆర్ఎస్ చెల్లిం చలేక పోతున్నారు. మార్చి నెలాఖరు వరకు గడువు ఉన్నప్పుడు అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం చేయడం వల్ల కొందరు ముందుకు వచ్చారు. ఏప్రిల్ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు పెంచిన తర్వాత సంబంధిత అధికారులు ఎల్ఆర్ఎస్‌పై ప్రచారం చేయలేక పోయారు.

### ● జిల్లా వ్యాప్తంగా 25,514 దరఖాస్తులు..

జిల్లా వ్యాప్తంగా వచ్చిన 25,514 దరఖాస్తులు రాగా, ఇప్పటి వరకు 6.393 మంది తమ ప్లాట్లను క్రమబద్ధీ

(మిగతా 8వ పేజీలో)

### ● విస్తృత ప్రచారం కల్పిస్తేనే..

రాష్ట్ర ప్రభుత్వ ఖజానా అడుగంటి పోవడంతో 25 శాతం రాయితీ కల్పిస్తూ ఎల్ఆర్ఎస్ పథకాన్ని ప్రభుత్వం ముందుకు తీసుక వచ్చింది. దీనిపై మొదట మార్చి నెలాఖరు వరకు గడువు విధించగా, అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆ తర్వాత మరో నెల రోజులు గడువు పెంచిన తర్వాత ప్రచారం మందగించింది. వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 33.15 శాతం దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించారు. 2020, ఆగస్టు 26లోపు సేల్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన లే అవుట్ యజమానులు, ప్లాటు ఓనర్లకు ఎల్ఆర్ఎస్‌కు అవకాశం కల్పించినట్లు ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని వేగిర పెట్టినా కూడా ఎవరు కూడా రుసుం చెల్లించేందుకు ముందుకు రాలేదు. దీంతో ప్రభుత్వం 25 శాతం రాయితీ కల్పించి విస్తృత ప్రచారం చేపట్టింది. ప్రస్తుతం ఈ నెలాఖరు వరకు మరోసారి గడువు పెంచడంతో జిల్లా అధికార యంత్రాంగం ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పెంపు గురించి ఎల్ఆర్ఎస్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మరోసారి విస్తృత ప్రచారం కల్పిస్తేనే దరఖాస్తుదారులు ముందుకు వచ్చే అవకాశాలున్నాయి.



# కష్టపడి పని చేసే వారికే పదవులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు, పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

పెద్దపల్లి టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్ట పడి పని చేసే వారికే ఎదవులు దక్కుతాయని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అధ్యక్షతన మండల, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, సంగీతం శ్రీనివాస్ పరిశీలకులుగా హాజరయ్యారు. జాతీయ, రాష్ట్ర పార్టీ నియమావళి మేరకు గ్రామ, మండల, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీల నియా మకంపై పరిశీలకులు వివరించారు. వారు మాట్లాడుతూ 2017 నుంచి పార్టీకి సేవలందించిన వారికే అవకాశా లుంటాయని, క్రమశిక్షణ లేని కార్యకర్తలను పార్టీ నుంచి తొలగిస్తామన్నారు. కమిటీల ఎన్నికలకు తాము హాజ రవుతామని, పూర్తి కాగానే జిల్లాస్థాయిలో బహిరంగ సభ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లాల్లో ప్రశాంతంగా మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికలు పూర్తి చేస్తామని మక్కాన్‌సింగ్ తెలిపారు. ఎమ్మెల్యే విజయ రమణా రావు మాట్లాడుతూ మొదట గ్రామ స్థాయి కమిటీలను ఎన్నిక చేసి మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామని, తద్వారా మెజారిటీ కార్యకర్తల అభిప్రాయం మేరకు పార్టీకి సమయం కేటాయించి పని చేసేవారిని గుర్తించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు సజావుగా కమిటీల నియామకం పూర్తి చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో బలమైన నాయకులను కమిటీల్లో ఎన్నిక చేస్తే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి సులువుగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికలు రాష్ట్రానికి ఆదర్శంగా నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు. నాయకులు గోపగాని సారయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు ఈర్ల స్వరూప, మినుపాల ప్రకాష్ రావు, రామిడి తిరుపతి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి యాదవ్, దామోదర్‌రావు, ఆరె సంతోష్, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# భూ భారతి చట్టంతో సమస్యలు పరిష్కారం


సుల్తానాబాద్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్వోఆర్ చట్టం భూ భారతితో భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సుల్తానాబాద్‌లో బుధవారం ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ కోర్టు కేసులు, కుటుంబ వివాదాలు మినహాయించి మిగిలిన సమస్యలకు భూ భారతి చట్టం పరిష్కారం చూపుతుందన్నారు. భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ముందు భూమి సర్వే జరి పి మ్యాప్ తయారు చేయాలన్నారు. భూముల విస్తీర్ణం, మార్పులు చేర్పులకు అవకాశం ఉందన్నారు. మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లు భూమికి భూదార్ కార్డు అందిస్తామన్నారు. పెండింగ్ సాదా బైనామా పరిష్కారానికి భూ భారతి చట్టం సెక్షన్ 6 కింద ఆర్డీఓకు బాధ్యతలు అప్పగించిందని, గడిచిన 12 ఏళ్లలో సాదాబైనామా భూములు అనుభవంలో ఉన్న వారికి మాత్రమే దరఖాస్తులు పరిష్కారమవుతాయన్నారు. బాధితులు సంతృప్తి చెందకుంటే అప్పీలు కూడా చేసుకునే అవకాశం ఉందన్నారు. వారసత్వం, వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ విచారణ జరిపి రికార్డులలో మ్యూటేషన్ చేస్తారని అన్నారు.

### కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించాలి

దేశంలో ప్రస్తుతం యుద్ధవాతావరణం ఉన్నందున ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే దుష్ప్రచారం నమ్మవద్దన్నారు. గత ప్రభుత్వం ధరణితో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, భూభారతి చట్టంతో ఆ ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ళు అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ కేటాయిస్తామని, ఇది పేదల ప్రభుత్వమన్నారు. అదనపు కలెక్టర్ వేణు, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశ్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ ,తహసిల్దార్ రాంచంద్రారావు, రైతులు పాల్గొన్నారు.

**ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి):** భూసమస్యల పరిష్కారం కోసమే భూభారతి రెవెన్యూ చట్టమని ఎమ్మెల్యే విజయ రమణారావు అన్నారు. నర్సాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్‌డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి ద్వారా అనేక మంది పేద రైతులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. వేల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయని, భూభారతి చట్టం రైతులకు ఎంతో మేలు కలుగుతుందని పేర్కొన్నారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తామన్నారు. సీఎం చొరవతో సీడ్ కంపనీల యాజమాన్యాలు క్వింటాల్ సీడ్ ధాన్యానికి రూ.2వేల నుండి 5వేల వరకు చెల్లిస్తున్నారన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. మంథని ఆర్‌డీవో సురేష్, తహసీల్దార్ యాకన్న, ఎంపీడీఓ భాస్కర్ రావు, పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, నరహరి సుధాకర్‌రెడ్డి, తిరుపతి, సిబ్బంది, నాయ కులు పల్లెర్ల వెంకటేష్‌గౌడ్, దుగ్యాల సంతోష్‌రావు, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, పాల్గొన్నారు.


నర్సాపూర్ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## తాగు నీటికి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు

పెద్దపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ సోర్స్‌గా తాగునీటి సరఫరా చేయాలని, అనవసరంగా బోర్లు వేయవద్దని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇతర నీటి వనరుల పై ఆధారపడాలన్నారు. తాగు నీటి కోసం పంచాయతీ వద్ద అందుబాటులో ఉన్న నిధులను అత్యవసరంగా వాడుకోవాలని అన్నారు. వేసవి కాలంలో ఎక్కడ తాగు నీటి సరఫరా కొరత రాకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీటి ఇబ్బందులు వచ్చినా ఎంపీడీవోలు మరమ్మతు పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఇంటికి తాగునీటి సరఫరా తప్పనిసరిగా ఉండాలన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ఈఈ మిషన్ భగీరథ గ్రిడ్ పూర్ణచందర్ రావు, ఇంట్రా ఈఈ గంగాధర శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని, పైలెట్ గ్రామాలు మినహా ఇతర గ్రామాలు, పట్టణాల్లో ఈనెల 10వ తేదీ వరకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు అవసరమైన మౌలిక వసతులకు ప్రతిపాదనలు అందించాలన్నారు. పెద్దపల్లి పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయని, ఈ నెలాఖరు వరకు లబ్ధిదారులకు అప్పగిస్తామని తెలిపారు. రామగుండంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద తాగునీరు, విద్యుత్ సరఫరా, డ్రైనేజీ పనులను 3 నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కాల్వశ్రీరాంపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద తాగు నీరు, సెప్టిక్ ట్యాంక్, రోడ్డు పనులు చేపట్టాలని అన్నారు. ప్రతీ మండలంలో ఎంపిక చేసిన పైలట్ గ్రామాలలో 1940 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తే బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మించుకున్న 170 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మొదటి విడత లక్ష రూపాయల ఆర్థిక సహాయం విడుదల చేసిందన్నారు. పైలట్ గ్రామాలలో మంజూరు చేసిన ఇళ్లలో కనీసం 50 శాతం వరకు ఇండ్లు గ్రౌండింగ్ చేసేలా కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరైన దాదాపు 1200 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణం ప్రారంభించ లేదని, వీరితో చర్చించి త్వరగా గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని, డబ్బు సమస్య ఉంటే డ్వాక్రా ద్వారా రుణాలు అందించాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరగాలని, ఎటువంటి ఒత్తిడులకు తావు ఇవ్వడానికి వీలు లేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాధాన్యత క్రమంలో ఎంపిక జరగాలని అన్నారు. జూన్ 2 వరకు లబ్దిదారుల ఎంపిక, శిక్షణ పూర్తి చేసుకోవాలని, జూన్ 2న యువ వికాసం యూనిట్ మంజూరు పత్రాలు పంపిణీ చేసి తర్వాత వాటి గ్రౌండింగ్ పై దృష్టి సారించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ, హౌసింగ్ ఈఈ రాజేశ్వర్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం కాళిందిని పెద్దపల్లి, మంథని మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి 8

# ఖని ఆసుపత్రిలో పెయిడ్ గదులు

- రోగులకు మరిన్ని వైద్య సేవలకు శ్రీకారం
- కలెక్టర్ ప్రత్యేక దృష్టి
- ఆదాయ వనరులకు మార్గాలు

కళ్యాణ్‌నగర్, మే 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆదాయ మార్గాల కోసం శ్రీకారం చుడుతున్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటైన తరువాత రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిం చడానికి కలెక్టర్ కోయశ్రీహర్ష ప్రత్యేక చొరవ చూపుతున్నారు. గోదా వరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు అన్ని రకాల వైద్య సేవ లను అందించేందుకు కలెక్టర్ తన నిధులతో పాత బిల్డింగ్‌లోని 1, 2వ అంతస్థుల్లో రినోవేషన్ ద్వారా ఆపరేషన్ థియేటర్లు, పెయిడ్ రూమ్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. పాత బిల్డింగ్‌లో 8జనరల్ షేరింగ్ గదులు, ఏడు ఏసీ గదులను అందుబాటులోకి తీసుకువచ్చారు. సాధారణ గదికి రోజుకు రూ.1000, ఏసీ గదికి రూ.1500లు, సాధారణ గదికి షేరింగ్ రూ.500, ఏసీ షేరింగ్ గదికి రూ.800లను ధరగా నిర్ణయించారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆసుపత్రి అభివృద్ధికి ఉపయోగించ నున్నారు. పాత బిల్డింగ్‌లో గతంలో ఒకటే ఆపరేషన్ థియేటర్ ఉండగా ఇటీవల మరమ్మతులు చేసి రెండు ఆపరేషన్ థియేటర్లతోపాటు పెయిడ్ గదులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందులో నిరంతరం వైద్య సేవలు అందించడానికి వైద్యులు, నర్సులు అందుబాటులో ఉండనున్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికార బాధ్యతలు చేపట్టిన తరువాత జిల్లాలోని ప్రాథమిక అర్బన్ హెల్త్ సెంటర్లు, గోదావరిఖని, పెద్దపల్లి


ఆసుపత్రిలో సిద్ధమైన గదులు

ఆసుపత్రుల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ రోగులకు కావాల్సిన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు రోగులు వెళ్లకుండా అన్ని రకాల వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందించే విధంగా చర్యలు చేపట్టారు.

### ● గర్భిణీల కోసం ప్రత్యేక వార్డులు

గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గర్భిణీల కోసం ఎంసీయూ, ఐసీయూ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రసవం పొందిన తరువాత మూడు రోజులపాటు ఐసీయూలో వారికి నిరంతరం చికిత్సను అం దిస్తూ అనంతరం జనరల్ వార్డులో చికిత్సను అందిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచడానికి కలెక్టర్ ప్రత్యేక చొరవను తీసుకుని సుఖ ప్రసవాలు జరిగే విధంగా నిరంతరం వైద్యులతో మానిటరింగ్ చేస్తూ మాత, శిశు మరణాలను తగ్గించే విధంగా కృషి చేస్తున్నారు.

ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కలెక్టర్ సతీమణి విజయ ప్రసవించారు. రెండో కాన్పు నుంచి ఇక్కడే నెల నెల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎంసీసీలో వారం రోజుల క్రితం కలెక్టర్ సతీమణి విజయ ప్రసవించారు.

### అందుబాటులోకి పెయిడ్ గదులు

-రాజు, ఆర్ఎంఓ



ఖని జనరల్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించేందుకు 15 పెయిడ్ గదులు అందుబాటులోకి వచ్చాయి. గదులు కావాలని రోగులు ఆసక్తి చూపుతున్నారు. కొత్త బిల్డింగ్ నిర్మాణం అయిన తరువాత మరిన్ని గదులు అందుబాటులోకి వస్తాయి. దీని కోసం ప్రత్యేకంగా సిబ్బంది ఏర్పాటు చేశాం. వచ్చిన డబ్బులు ఆసుపత్రి అభివృద్ధికి ఖర్చు చేస్తాం.

## సెల్ఫీ వీడియో తీసి యువకుడి ఆత్మహత్య

● ప్రేమించిన యువతి మోసగించిందని మనోవేదన


దార ఐలేష్ (ఫైల్)

జమ్మికుంట/ఇల్లందకుంట, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతి తనను కాదని మరొకరితో వివాహం చేసుకోవడంతో మన స్థాపానికి గురైన ఓ యువకుడు సెల్ఫీవీడియో తీసి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన జమ్మికుంట రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఇల్లందకుంట మండలం లక్ష్మణపల్లి గ్రామానికి చెందిన దార ఐలేష్(23) హైదరాబాద్‌కు చెందిన వరలక్ష్మి అనేయువతితో కొన్నాళ్లుగా ప్రేమాయణం సాగిస్తున్నాడు. వీరి ద్దరు కొంతకాలంపాటు సహజీవనం చేసినట్లు సమాచారం. ఇంటర్మీడి యట్ చదువుతున్న సమయంలో వీరిమధ్య ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారినట్లు తెలుస్తోంది. ఐలేష్ జమ్మికుంటలో ఐటీఐ పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో అప్రెంటీస్‌షిప్ చేస్తున్నాడు. ఓ శుభకా ర్యానికి హాజరయ్యేందుకు మూడురోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. ఇటీవల వరలక్ష్మి తన బావను వివాహం చేసుకుంది. అప్పటి నుంచి ఐలేష్‌కు దూరంగా ఉంటూవస్తోంది. దీంతో తీవ్రమనస్థాపానికి గురైన ఐలేష్ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఉదయం నుంచి ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు వాట్సాప్ స్టేటస్‌పెట్టుకున్నాడు. జమ్మి కుంట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారమ్‌పై కూర్చొని సెల్ఫీ వీడియో తీసు కుంటూ ఎనిమిదేళ్లు వరలక్ష్మితో కలిసిమెలిసి ఉన్నానని, సెల్‌ఫోన్ కొని చ్చానని పేర్కొన్నాడు. మేం ఇద్దరం కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలు, రికార్డులు తనఫోన్‌లో ఉన్నాయని, తాను ఆత్మహత్య చేసుకున్న తర్వాత వాటన్నింటిని వరలక్ష్మికి చూపించాలని సెల్ఫీ వీడియోలో కోరాడు. తన మృతదేహాన్ని ఆమె ఇంటిఎదుట వేయాలని సెల్ఫీ వీడియోలో పేర్కొ న్నాడు. మన ఆస్తులు అమ్మి అయినా కేసు పెట్టి శిక్షించాలని తల్లిదం డ్రులను సెల్ఫీ వీడియోలో కోరాడు. అనంతరం ఇంటర్‌సిటీ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

## గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి


రాజ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన మాజీఎంపీటీసీ కంక ణాల రాజ్‌కుమార్‌రెడ్డి(45) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన భూమి కరీంనగర్-వరంగల్ బైపాస్ రోడ్డు కింద కోల్పోవడంతో మనో వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే గుండెపోటుకు గురయ్యాడు. బుధవారం కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామ స్థుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. కుమార్తె శివాని దహన సంస్కారాలు నిర్వహించింది. ఆయన మృతిపట్ల ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్, పలువురు నాయకులు సంతాపం తెలియజేశారు.

## వివాహం కావడం లేదని.. యువకుడి బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): వివాహం కావడం లేదని మన స్థాపం చెందిన యువకుడు ఒగ్గు మహేశ్(24) ఉరి వేసుకుని బలవ న్మరణానికి ఒడిగట్టిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మహేశ్ గొర్రెలను పెంచుతూ జీవించేవాడు. వివాహ సంబం ధాలు వచ్చిన నిశ్చయం కాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈనెల 6న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు తిరిగి చేరుకోలేదు. దాంతో ఆందోళనకు లోనైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. బుధవారం ఉదయం ఇంటి సమీపంలోని ఓ పాడుబడిన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి తల్లి రాజవ్వ, సోదరుడు నగేశ్‌లు ఉన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

తంగళ్లపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మండేపల్లి కేసీఆర్‌నగర్‌కు చెందిన తాడూరి రామ్‌కుమార్(38) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... రామ్‌కుమార్ జిరాక్స్ మిషన్ మెకానిక్‌గా పనిచేస్తూ భార్య వనిత, ముగ్గురు కుమారులను పోషిస్తున్నాడు. సరైన పనిలేక కుటుంబ పోషణకు అప్పులు చేసి తీవ్ర ఆర్థికఇబ్బందులకు గురయ్యాడు. కుటుంబ పోషణభారం, ముగ్గురుపిల్లలు జన్మించినప్పుడు వైద్య ఖర్చుల కోసం రూ.3లక్షల వరకు అప్పులయ్యాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య వనిత, కుమారులు సుకజీత్(11), శ్రీవాత్సవ్(5), విహాన్ ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### దహన సంస్కారాలు చేయలేని పరిస్థితి..

కుటుంబాన్ని పోషించుకోలేక భర్త ఆత్మహత్య చేసుకోగా.. దహన సంస్కారాలు నిర్వహించడానికి భార్య చేతిలో చిల్లి గవ్వలేక దీనంగా మృతదేహం వద్ద రోదిస్తుండడం పలువురిని కలచివేసింది. మృతదేహం వద్ద ముగ్గురు చిన్నపిల్లలతో గుండెలు పగిలేలా రోదిస్తుండడం పలు వురిని కంటతడి పెట్టించింది. దహన సంస్కారాలకు ఆర్థిక సాయం చేయడంతో పాటు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతు న్నారు.

# ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

● పండ్ల తోటలు... కూరగాయల సాగుకు రాయితీలు
● యంత్ర పరికరాలకు సబ్సిడీ



చొప్పదండి, మే 7 (ఆంధ్రజ్యోతి): వరిసాగుకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల సాగును పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలను అందిస్తోంది. పండ్ల తోటలు, పూల సాగు, కూరగాయల సాగుకు సబ్సిడీలతో పాటు యంత్రాలు, యంత్ర పరికరాలు, సూక్ష్మ నీటి సేద్యానికి 2025-26 సంవత్సరానికి ఉద్యానవనశాఖ రాయితీలను అందిస్తోంది.

### పండ్ల తోటల పెపంకం (హెక్టారుకు)...

**మామిడి:** 19,200 రూపాయలు, **నిమ్మ:** 19,200, **జామ:** 19,200, **అరటి:** 16,800, **అవకాడో:** 12,000, **బొప్పాయి:** 7,200, **డ్రాగన్ ఫ్రూట్:** 65,000, **ముదురు మామిడి తోటల పునరుద్ధరణ** 9,600, **ఆయిల్ ఫాం సాగుకు** 10,500 రూపాయల రాయితీ ఉంటుంది.

### కూరగాయల సాగు (ఎకరానికి)...

**టమాటో:** 10,000, **వంగ:** 10,000, **క్యాబేజీ:** 10,000, **కాలిఫ్లవర్:** 10,000, **మిర్చినారుకు** 10 వేల రూపాయల సబ్సిడీ ఉంటుంది.

● ప్లాస్టిక్ మల్చింగ్ వేసుకునే రైతులకు హెక్టా రుకు 20 వేల రూపాయల సబ్సిడీ.

● తీగజాతి కూరగాయల సాగు, శాశ్వత పందిర్ల నిర్మాణం కోసం ఎకరానికి లక్ష రూపాయల సబ్సిడీ అందజేస్తారు.

● పూల సాగును చేపట్టే రైతులకు ప్రతి ఎకరాకు 8 వేల రూపాయల రాయితీని నగదు రూపంలో అందజేస్తారు.

### యంత్రాలు...

ఉద్యాన పంటల సాగు కోసం 20 హెచ్‌పి ట్రాక్టర్‌కు 2 లక్షల 45 వేల సబ్సిడీ
**పవర్ టిల్లర్:** లక్ష రూపాయల సబ్సిడీ
**పవర్ వీడర్ :** 75 వేల సబ్సిడీ
**బ్రష్ కట్టర్స్ :** 25 వేల సబ్సిడీ

### సూక్ష్మ నీటి సేద్యం

బిందు, తుంపర్ల సేద్య పరికరాల కోసం సబ్సిడీ అందజేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ, బీసీ రైతులకు 90 శాతం, ఓసీ రైతులకు (5 ఎకరాల వరకు) 90 శాతం, 5 ఎకరాలపై రైతులకు 80 శాతం సబ్సిడీ అందజేస్తుంది.

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**చింతల రోహిత్, ఉద్యానశాఖ అధికారి, చొప్పదండి**



ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలను రైతులు సద్వినియోగం చేసు కోవాలి. ఉద్యాన పంటల సాగుతో అనేక లాభాలు ఉన్నా యి. మార్కెట్‌లో పూలు, కూరగాయలు, పండ్లకు చాలా డిమాండ్ ఉంది. రైతులు ఉద్యాన పంటల సాగు చేపట్టాలి. ఉద్యాన పంటలను తక్కువ నీటితో ఎక్కువ సాగు చేపట్టవచ్చు.

## బాలుడి మృతికి కారణమైన తల్లి, ఆమె ప్రియుడు అరెస్టు

సిరిసిల్ల క్రైం, మే 7 (ఆంధ్రజ్యోతి): కొడుకు మృతికి కారణమైన కన్నతల్లి, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన అరుష్(5) అనే బాలు డిపై కన్నతల్లి, ఆమె ప్రియుడు దాడి చేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనలో తల్లి మాధవి, కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామానికిచెందిన సామల కిషన్‌లను బుధవారం అరెస్టుచేసి రిమాం డ్‌కు తరలించామని సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. తల్లి జైలుకు వెళ్లడంతో ఒంటరైన ఎనిమిదేళ్ల కూతు రిని బాలసంరక్షణ సమితి చేరదీసింది. బాలికను చూసుకునేందుకు నానమ్మ, తాత ముందుకు వచ్చినప్పటికీ చట్ట ప్రకారం పోలీసులు ఆమెను బాలసం రక్షణ సమితికి అప్పగించారు. దీంతో బాలికను సఖీ కేంద్రానికి తరలించారు.

## బెహరాన్‌లో మల్లాపూర్ యువకుడి మృతి


పోగుల నరేష్(ఫైల్)

మల్లాపూర్, మే, 7 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్‌కు చెందిన పోగుల నరేష్ (23)అనే యువకుడు బెహరాన్ దేశంలో అనారోగ్యంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు గ్రామస్థులు బుధవారం తెలిపారు. పోగుల సురేష్ జీవనోపాధి కోసం ఐదేళ్ల క్రితం బెహరాన్‌కు వెళ్లాడు. కొంతకాలం నుంచి నరేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు.బెహరాన్‌లో పనులు చేస్తుండగా ఆకస్మత్తుగా ఒక్కసారిగా కుప్పకూలి కిందపడ్డాడు. స్థానికులు గమనించగా నరేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే వారు కుటుంబ సభ్యులకు ఫోన్‌ద్వారా సమా చారం అందించారు. నరేష్ మరణవార్త విన్న కుటుంబసభ్యుల రోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య

గొల్లపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన నార్ల త్రిష(21) అనే యువతి తల్లి మందలించిందని బుధ వారం తెల్లవారుజామున ఇంటిలో ఉరే సుకుని బలవన్మరణం చెందింది. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు నార్లత్రిష ముంబాయిలో ఇంటర్ పూర్తి చేసి వచ్చి ఇంటి వద్దే ఉంటోంది. ఇంటిలో పనులుచేయడం లేదని మంగ ళవారం తల్లి మందలించింది. దీంతో తీవ్రమనస్తాపానికి గురైన త్రిష బుధ వారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మపురి, మే 7 (ఆంధ్రజ్యోతి): ధర్మ పురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొంతాపూర్ గ్రామశివారులో పేకాట ఆడుతున్న ఏడుగు రిని సీసీఎస్ పోలీసులు బుధవారం అదు పులోకి తీసుకుని వారివద్ద నుంచి 11,100 రూపాయలు, 6మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను ధర్మపురి పోలీసులకు అప్పగించగా కేసునమోదు చేశారు. జిల్లాఎస్పీ ఆదేశాలతో నిఘా పటి ష్టం చేసి దాడులు నిర్వహిస్తున్నట్లు సీసీ ఎస్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్స్ రమష్, ఆఫ్రోజ్, కమలాకర్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంగాధర, మే 7 (ఆంధ్రజ్యోతి): గంగా ధర మండలం కురిక్యాలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. అక్రమ ఇసుకరవాణాలో సంబంధమున్న నలు గురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆమె తెలిపారు.

## అదనపుకోర్టు ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో అదనపు జిల్లాకోర్టు ఏర్పాటుచేయాలని న్యాయవాదులు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సాను కూలం గా స్పందించిన బండి సంజయ్‌కుమార్ ఈ విషయాన్ని హైకోర్టు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు యతిపతి అరుణ్‌కుమార్, బార్ అసోసియే షన్ జనరల్ సెక్రెటరీ రమేష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది, బీజేపీ జిల్లాఅధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం.. తడిసిన ధాన్యం


వీర్నపల్లిలో వర్షపునీటిని తొలగిస్తున్న రైతు

వీర్నపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పండించిన వరిధాన్యం అకాలవర్షానికి తడిసి పోయింది. మండలకేంద్రంతోపాటు పలు గ్రామా ల్లో బుధవారం తెల్లవారుజామున ఈదురుగాలు లతో కురిసిన వర్షానికి ధాన్యపురాశులు, తూకం వేసిన బస్తాలు తడిసిపోయాయి. అన్నదాతలు తడిసిన ధాన్యాన్ని ఆరబోసేందుకు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యం తరలింపు జాప్యం చేయడం వల్ల నష్టపోతున్నామని రైతులు మండిపడు తున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

**చందుర్తి:** చందుర్తి మండలంలో ఈదురు గాలులకు విద్యుత్‌తీగలు తెగిపడ్డాయి. స్తంభాలు, వృక్షాలు నెలకొరిగాయి. మండలకేంద్రంతోపాటు మర్రిగడ్డ, ఎనగల్ గ్రామాల్లోని కొనుగోలుకేంద్రాల్లో ధాన్యం తడిసిపోగా, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టారు. లింగంపేట, సనుగుల రహదారిలో చెట్లువిరిగి విద్యుత్‌స్తంభాలపై పడడంతో కరెంటువైర్లు నేలవాలాయి. లింగంపేటలో విద్యుత్‌సర ఫరాకు అంతరాయం ఏర్పడగా వెంటనే మరమ్మతులు చేపట్టారు.

**ఎల్లారెడ్డిపేట:** మండలకేంద్రంతోపాటు రాచర్ల బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి, తిమ్మాపూర్, గుండారం, రాజన్నపేటఅల్మాస్‌పూర్ తదితర గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన అకాలవర్షానికి కొనుగోలుకేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. వరద నీటికి ధాన్యం కొట్టుకుపోయింది. ధాన్యం రాశులపై కప్పిన టార్పాలిన్లలో చేరిన వాననీటిని తొలగించేందుకు అన్నదాతలు అవస్థలు పడ్డారు. తూకం వేసినబస్తాలు తడిసిపోవడంతో మొలకెత్తుతాయని వాపో తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.


చందుర్తిలో తడిసిన ధాన్యం బస్తాలు


చందుర్తిలో తెగిన విద్యుత్ వైర్లు

## నిర్వాసితులకు పరిహారం నిర్ణయించలేదు

● కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ, మే 7 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలో మెయిన్‌రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు చెల్లిం చే పరిహారం ధరపై ఇంకా తుదినిర్ణయం తీసుకోలేదని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒకప్రకటనలో తెలిపారు. మంగళవారం వేములవాడలో రోడ్లవెడల్పునకు సంబంధించి సర్వేని వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించానని, ఈ సందర్భంగా పరిహారంపై మీడియాలో వచ్చిన ధర అధికారికంగా నిర్ణయించలే దన్నారు. రోడ్డు డిజైన్, నిర్మాణగడువు తదితరఅంశాలపై కూడా తుది ప్రకటన విడుదల చేయలేదని, పరిహారం ధరపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని ఆయన తెలిపారు.

## అగ్నికి ఆహుతైన పంటలు

ముత్తారం మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారుపెల్లి శివారులోని మానేరువాగు పరివాహక ప్రాంతంలో అగ్ని ప్రమాదంలో ముగ్గురు రైతులకు తీవ్ర నష్టం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మానేరు వాగు పరివాహక ప్రాంతం లో రైతులు వేల్పుల రవికి చెందిన ఎకరం వరి కుప్ప, అలాగే చల్ల సదికి చెందిన మూడు ఎకరాల కోసి ఒక దగ్గర ఉన్న వరి కుప్ప పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నికి ఆహుతై కోసిన పంట మొత్తం కాలిపోవడంతో రైతుల ఆదుకోవాలని వేడుకొన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అదుకోవాలని కోరారు. ఇదేప్రాంతంలో ఉన్న రాపెల్లి సురేందర్‌కు చెందిన 10 ఎకరాల ఆయిల్ పామ్ తోటలోని 302చెట్లుపూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. చుట్టుపక్కల రైతులు వచ్చి మంటలను చల్లార్చారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగేయా లేక ఎవరైనా అంటించారా అనేది తేలాల్సి ఉంది.


కాలిపోతున్న పామాయిల్ తోట

# ద్విచక్రవాహనాల నిందితుల అరెస్టు

● 12 వాహనాలు స్వాధీనం


పట్టుకున్న వాహనాలు, నిందితులతో డీసీపీ భాస్కర్

జన్నారం, మే 7 (ఆంధ్రజ్యోతి): ఒక ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న నిందితులను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేస్తున్నారు. డీసీపీ భాస్కర్ జన్నారం పోలీస్‌స్టేషన్‌లో వివరా లను వెల్లడించారు. నిర్మల్‌జిల్లా దస్తూరాబాద్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన బత్తుల పరమేష్, రెంకల నరేష్, కొట్టె బానేష్ , జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన లావుడ్య హరికృష్ణ, మురిమడుగు గ్రామానికి చెందిన సంపంగి రమేష్‌లు ఒక ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాలను దొంగతనం చేస్తున్నారు. మార్చి 5న జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం పోచారం గ్రామానికి చెందిన కంచర్ల నరేష్ జన్నారం మండల కేంద్రంలోని ఉడిపి హోటల్ వద్ద తన ఫ్యాషన్ ప్రో వాహనాన్ని నిలిపి వెళ్లాడు. బయటకు వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 7న ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఫ్యాషన్ ప్రో వాహనంపై వస్తున్న బత్తుల పరమేష్, రెంకల నరేష్ పోలీసులను చూసి పారిపోతుండగా పోలీసులు పట్టుకుని విచారించారు.

పోలీసుల విచారణలో బానేష్, హరికృష్ణ, రమేష్‌లతో కలిసి వాహనాలు దొంగతనాలు చేస్తున్నారని ఒప్పుకున్నారు. వీరు మంచిర్యాల, జగిత్యాల, జన్నారం, తదితర ప్రాంతాల్లో 12ద్విచక్రవాహనాలను దొంగలించారు. ఇందులో బత్తుల పరమేష్, రెంకల నరేష్, లావుడ్య హరికృష్ణలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 12 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో మరో నిందితుడు సంపంగి రమేష్ పాత కేసులో జైలులో ఉండగా కొట్టె బానేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనాలను కొనుగోలు చేసినా, అమ్మినా నిజ ధృవీకరణ పత్రాలను పరిశీలించిన తర్వాతనే కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిందితులను పట్టుకున్న పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్ఐ రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు

కాగజ్‌నగర్ టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి, దహెగాం, కాగజ్‌నగర్‌లోని ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నింది తులను బుధవారం కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రాత్రి కాగజ్‌నగర్ రూరల్‌సీఐ శ్రీనివాస రావు వివరాలు వెల్లడించారు. గతనెల 2న రాత్రి కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడ ఆంజనేయ స్వామి ఆలయంలో, దహెగాం మండలంలోని బోర్లకుంట గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంతోపాటు, కాగజ్‌నగర్ మండలం బట్టుపల్లి గ్రామం లోని భక్త ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ జరిగిందని చెప్పారు. ఈజీగా డబ్బు సంపాదించి జల్సాలు చేయాలనే ఉద్దేశ్యం తో చోరీచేసినట్లు నిందితులు ఒప్పుకు న్నారన్నారు. నిందితులు త్రిదండపాణి అనిల్‌కుమార్ (పెద్దపల్లి జిల్లా, హనుమం తునిపేట), బాణాలలక్ష్మణ్ (పెద్దపల్లి)లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిం దితులపై పెద్దపల్లి, వేములవాడ, వెల్గ టూరు, సుల్తానాబాద్, పొత్కపల్లి, వీణ వంక, ధర్మారం, మల్యాల, రామగిరి పోలీసుస్టేషన్‌లలో కేసులు నమోద య్యాయని తెలిపారు. మరో నిందితుడు పైడి అజయ్ (పెద్దపల్లి జిల్లా రాంపలి) పరారీలో ఉన్నాడన్నారు. కూలీపని చేసు కునే అనిల్‌కుమార్, మెకానిక్ అజయ్ కలిసి ఈనెల 2న భాగ్యనగర్ రైలులో కాగజ్‌నగర్ చేరుకున్నారని అన్నారు. రాత్రి దహెగాం వెళ్లి అక్కడి గుడి తాళాలు పగులగొట్టి చోరీచేశారని తెలిపారు. తిరుగు ప్రయాణంలో కాగజ్‌నగర్ మండలంలోని బట్టుపల్లి ఆలయంలో చోరీ చేశారని అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పంచముఖ హనుమాన్ ఆలయంలో కూడా చోరీచేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని సీఐ తెలిపారు.

మూడు చోరీ కేసుల్లో నిందితుల నుంచి రెండు వెండి కిరీటాలు, వెండి మకుటం, వెండి హారం, వెండి నామాలు, వెండి పాదుకలు, బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను అరెస్టు చేసినట్లు సీఐతెలిపారు. సమావేశంలో రూరల్ ఎస్సై సందీ్ కుమార్, ఏఎస్సై సర్తాజ్ పాషా పాల్గొన్నారు.

## నేడు ప్రపంచ అండాశయ క్యాన్సర్ దినోత్సవం

సుభాష్‌నగర్, మే 7(ఆంధ్రజ్యోతి): అండాశయ క్యాన్సర్ మహిళలను ప్రభావితం చేసే ప్రాణాంతక క్యాన్సర్లలో ఒకటి. అండాశయ క్యాన్సర్ అనేది స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థలోని చిన్న అవయవాలైన అండాశయాలలో ప్రారంభయ్యే ఒక రకమైన క్యాన్సర్.



**లక్షణాలు :** అండాశయ క్యాన్సర్ యొక్క లక్షణాలు కడుపులో వాపు లాంటి భావన ఏర్పడుతుంది. దీని ఫలితంగా ఆకలి లేక పోవడం లేదా త్వరగా నిండినట్లు అనిపించడం. పొత్తికడుపులో నొప్పివస్తుంది. పేగు అలవాట్లలో మార్పులు జరుగుతాయి. విరేచనాలు, మలబద్ధకం, కడుపులో తరుచుగా గ్యాస్ అనుభూతి కొనసాగుతుంది. మూత్ర విసర్జన చేయాలనే కోరిక అనిపిస్తుంది, కానీ మూత్రవిసర్జనకు వెళితే రాకపోవడం ఉంటుంది. లైంగిక చర్యలో ఉన్నపుడు నివారించలేని నొప్పి అండాశయ క్యాన్సర్ హెచ్చరిక లక్షణాలు కనిపిస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుంటారు. అయితే అండాశయ క్యాన్సర్‌ను ప్రారంభంలో గుర్తించడం కష్టమని వైద్యులు చెపుతున్నారు. అయితే ఇలాంటి లక్షణాలన్నీ అండాయశ క్యాన్సర్‌కు దారితీస్తాయని చెప్పలేమని తెలుపుతున్నారు.




### ప్రపంచ అండాశయ క్యాన్సర్ దినోత్సవం ప్రాముఖ్యత

2013 నుంచి ప్రపంచ క్యాన్సర్ కూటమి ప్రపంచ వ్యాప్తంగా మే 8న అండాశయ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అండాశయ క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడం, రోగ నిర్ధారణను ప్రోత్సహించడం దీని లక్ష్యం

### స్త్రీలను వేధిస్తున్న క్యాన్సర్లలో ప్రధానమైనది

**డాక్టర్ విష్ణుప్రియ, గైనకాలజిస్టు మెడికవర్ హాస్పిటల్, కరీంనగర్**



స్త్రీలను వేధిస్తున్న క్యాన్సర్లలో ప్రధానమైనది అండాశయ క్యాన్సర్. స్త్రీల గర్భాశయంలో రెండు వైపులా రెండు అండాశయాలు ఉంటాయి. అండాశయాల్లో కణాలు అదుపులేకుండా పెరిగిపోవడమే అండాశయ (ఒవేరియన్) క్యాన్సర్. మారుతున్న జీవనశైలి కారణంగా భారతదేశంలో అండాశయ క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. జన్యుపరమైన అంశం కూడా దీనికి కారణమవుతుంది. సాధారణంగా 50 సంవత్సరాలు నిండిన వారిలోనే అండాశయ క్యాన్సర్ ఎక్కువగా కనిపిస్తుంది. దీనిని ముందుగా గుర్తించకపోతే క్యాన్సర్ కణాలు క్రమంగా చుట్టుపక్కల కణజాలాల్లోకి వ్యాప్తి చెంది శరీరంలోని ఇతర ప్రాంతాలకు క్యాన్సర్ వ్యాప్తికి దారితీయ వచ్చు. కేవలం 20శాతం అండాశయ క్యాన్సర్‌లు మాత్రమే ప్రారంభదశలో కనిపిస్తాయి. స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను ప్రారంభదశలో గుర్తించవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలి క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.


## కల్లోల కాపురం

- బంధాలను బలితీసుకుంటున్న 'ఇగో'
- చిన్న చిన్న మనస్పర్థలతో రాణా మెట్లెక్కుతున్న దంపతులు
- క్షణికావేశంలో బలవన్మరణాలు

● జిల్లాకు చెందిన డిగ్రీ వరకు చదివిన ఓ యువతికి పొరుగు జిల్లాకు చెందిన యువకుడితో ఇటీవల వివాహం జరిగింది. ప్రతి ఆదివారం తనను కరీంనగర్‌కు పంపించాలని, లేదంటే కాపురం చేసేది లేదంటూ ఆమె భీష్మించుకుంది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు చెలరేగాయి. చివరికి ఇద్దరు పోలీసులను ఆశ్రయించారు. విడాకులు తీసుకోవడానికి అయినా సిద్ధమే కాని తనను ప్రతీ ఆదివారం తల్లిగారిల్లు కరీంనగర్‌కు పంపాల్సిందేనని ఆమె తెగేసి చెప్పింది. మహిళా స్టేషన్ పోలీసులు ఇద్దరికి కౌన్సెలింగ్ చేసినా ఇద్దరూ వెనక్కి తగ్గలేదు. చేసేదేమి లేక భార్య పెట్టిన కండీషన్‌కు భర్త అంగీకరించడంతో వారి సంసారం సజావుగా నడుస్తోంది.

● భర్త సెల్‌ఫోన్ లాక్ చేసుకుంటున్నాడని, ఎవరితోనో మాట్లాడుతున్నాడని అనుమానిస్తున్నది భార్య. బాత్‌రూంకు పోయిన సందర్భంలో తన ఫోన్ చెక్ చేస్తున్నదని భర్త అసహనం. ఒకరిపై ఒకరు గొడవపడి చివరకు పోలీసులను ఆశ్రయించారు. తాను స్నేహితులతో మాట్లాడుతుండడం తప్పా?అని భర్త ప్రశిస్తుంటే.. రహస్యం ఏమీలేనప్పుడు ఫోన్‌కు లాక్ ఎందుకు పెట్టుకున్నాడని భార్య ప్రశ్న. ఇద్దరికి మహిళా స్టేషన్‌లో పోలీసులు పదిమార్లు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

- కరీంనగర్ క్రైం, ఆంధ్రజ్యోతి



దంపతుల మధ్య 'ఇగో' కాపురాలను కూల్చుతున్నది. సరదాగా సాగాల్సిన కాపురాల్లో చిన్న చిన్న మనస్పర్థలు, గిల్లికజ్జాలు, అనుమానాలు కలతలను సృష్టిస్తున్నాయి. జీవితాంతం తోడూనీడగా కలిసి నడవాల్సిన ఆలుమగల మధ్య విభేదాలు మొదలవుతున్నాయి. చిన్న చిన్న గొడవలకు సర్దుకుపోవాల్సిన దంపతులు మొండిపట్టు పడుతుండడంతో విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. చివరికి అవి విడాకులకు దారి తీస్తున్నాయి. విద్యావంతులైన దంపతుల్లోనే ఇటువంటి ఆలోచనలు రావడం ఆందోళనకు గురిచేస్తోంది. చిన్న చిన్న విభేదాలు, అనుమానాలు తారాస్థాయికి చేరి దంపతులు రాణా మెట్లెక్కుతుండడంతో పోలీసులు వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలోనూ ఎవరికివారే తమ వాదనే సరైందని సమర్థించుకుంటున్నారు. ఈ సమయంలో సర్దిచెప్పాల్సిన కుటుంబ సభ్యులు సరైన సమయంలో స్పందించకపోవడంతో దంపతుల మధ్య దూరం పెరిగిపోతోంది. మరి కొందరు పోలీసులు, పెద్దల వద్దకు వెళితే ఎక్కడ పరువు పోతుందోనని, ఎవరికి చెప్పుకోలేక లోలోన మదనపడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నాయి. అనుమానాలు, అపార్థాలు, వివాహేతర సంబంధాలు సజావుగా సాగాల్సిన కాపురాల్లో కలతలు రేకెత్తిస్తూ బలవన్మరణాలకు దారితీస్తున్నాయి.



### ● ఉద్యోగస్తులదీ అదే దారి

మహిళా పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల్లో ఉద్యోగం చేస్తున్న, డిగ్రీపైన చదువుకున్న దంపతులు, ప్రేమ వివా హం చేసుకున్న నవ దంపతులవే ఎక్కు వగా ఉంటున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగం చేస్తున్న దంపతుల మధ్య ఇగోతో పోలీస్‌స్టేషన్ మెట్లెక్కుతున్నారు. ఇద్దరు ఉద్యోగం చేస్తుంటడంతో సంపాదనలో తామేమీ తక్కువ కాదంటూ తరచుగా గొడవ పడుతున్నారు. ప్రేమ వివాహం చేసుకున్న వారు ఏడాదిలోపే ఆర్థిక ఇబ్బందులు, అనుమానాల కారణంగా ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు.

**మహిళా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు..**

| సం. | ఫిర్యాదులు | కేసులు | రాజీపడినవి |
|---|---|---|---|
| 2022 | 1,104 | 92 | 1,012 |
| 2023 | 954 | 86 | 868 |
| 2024 | 1,099 | 113 | 986 |
| 2025 | 400 | 39 | 250 |

(ఏప్రిల్ 15 వరకు)

### ● కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబాలు

గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు దంపతుల్లో బేదాభిప్రాయాలు తలెత్తినా... చిన్న చిన్న గొడవలు వచ్చినా కుటుంబంలో పెద్దలు ఇరువురిని కూర్చుండబెట్టి మంచి చెడులు... వాటి పరిణామాలు విడమరచి చేప్పేవారు. మారిన కాలంతో ఉమ్మడి కుటుంబాలు అంతరించి పోతున్నాయి. వివాహం అయిన వెనువెంటనే విడిగా కాపురం ఉండడం, ఉద్యోగ రీత్యా ఇతర చోట్ల కాపురం పెట్టడంతో దంపతుల మధ్య గొడవలు తలెత్తినప్పుడు సర్దిచెప్పేవారు లేకుండా పోతున్నారు.



### మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుల వెల్లువ

పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏకైక మహిళా పోలీస్ స్టేషన్ కరీంనగర్‌లో ఉంది. ఈ పోలీస్ స్టేషన్‌కు భార్యభర్తల మధ్య తగువులు, వరకట్నం వేధింపులు, గృహహింస, ప్రేమ వివాహాలకు సంబంధించిన ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కమిషనరేట్ పరిధిలో ఉన్న మూడు పోలీసు సబ్ డివిజన్లలోని 21 స్టేషన్ల సంబంధించిన మహిళల కేసులు ఈ స్టేషన్‌కు బదిలీ చేస్తున్నారు. 2024లో 1,099 మంది దంపతులు గొడవపడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో 113 కేసులు నమోదుకాగా మరో 986 ఫిర్యాదుల్లో దంపతులకు కౌన్సెలింగ్‌లు ఇచ్చి సమస్యను పరిష్కరించారు. కొన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 2025 ఏప్రిల్ 20వ తేదీ వరకు 400 మంది భార్యభర్తలు గొడవలు పడి కరీంనగర్ మహిళా రాణాలో ఫిర్యాదులు చేసుకోగా 39 కేసులు నమోదయ్యాయి. 250 ఫిర్యాదులపై దంపతులకు కరీంనగర్ మహిళా రాణా సీఐ పి శ్రీలత, భూమిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌తో సర్దుకుపోయారు.



## ధర్మపురిలో నవరాత్రోత్సవాలు

- ఐదో రోజు పూర్ణాహుతి
- సహస్ర కలశాభిషేకం



పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, మే 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఐదవ రోజు బుధవారం శ్రీ నరసింహ నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఉదయం వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రా భిషేక పూజలు, సహస్ర కలశాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ అర్చ కులు, సిబ్బంది పాల్గొన్నారు. నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని లక్ష్మీ నరసింహ స్వామి వారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకుని పూజలు చేశారు.

### నేడు లక్ష్మీనృసింహస్వామి కల్యాణం



ఖిలావనపర్తిలోని లక్ష్మీనృసింహస్వామి దేవాలయం

ధర్మారం, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖిలావనపర్తి గ్రామంలో లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారి కల్యాణం జరగనుంది. మంగళవారం నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం సాయంత్రం 7.40 నిమిషాలకు స్వామి వారి కల్యాణం వేలాది మంది భక్తుల మధ్య అంగరంగ వైభవంగా జరగనుంది. కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈవో కాంతరెడ్డి, చైర్మన్ సంతోష్ తెలిపారు. బుధవారం కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 13 జరిగే స్వామి వారి రథోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

## రసాభాస

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

- ఏఐసీసీ పరిశీలకుడి ఎదుటే రచ్చ
- జువ్వాడి, సుజీత్‌రావు వర్గీయుల మధ్య వాగ్వాదం




జగిత్యాలలో నిర్వహించిన సమావేశంలో వాగ్వాదం చేసుకుంటున్న కాంగ్రెస్‌లోని రెండు వర్గాలు, పార్టీ శ్రేణులను సముదాయిస్తున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వ హించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం రసాభాసగా జరిగింది. ఈసమావే శానికి ఏఐసీసీ పరిశీలకుడు కత్తి వెంకట స్వామి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి హాజరు కాగా వారి ఎదుటే కోరుట్ల నియోజకవర్గానికి చెందిన రెండు వర్గాల నాయకులు రచ్చ చేశారు. వేదికపైకి మెట్‌పల్లి మార్కెట్ చైర్మన్ గోవర్ధన్ రావడంతో కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు వర్గీయులు ఒక్కసారిగా బీఆర్ఎస్ కోవర్ట్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న కోరుట్ల నియోజకవర్గానికి చెందిన కల్వకుంట సుజిత్‌రావు వర్గీయులు, నర్సింగారావు వర్గీయులతో వాగ్వాదానికి దిగి ఒకరినొకరు తోసుకున్నారు. పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన వారిని కాదని వలసవాదులకు మార్కెట్ చైర్మన్ పదవులు ఎలా ఇస్తారంటూ నర్సింగారావు వర్గీయులు ఆరోపించారు. ఇండిపెం డెంట్‌గా పోటీ చేసి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లి బీజేపీతో కలిసింది నిజం కాదా అని జువ్వాడి నర్సింగారావును ఉద్దేశించి సుజిత్‌రావు వర్గీయులు విమర్శించారు. దీంతో పరిస్థితి చేజారుతోందని గ్రహించిన విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇరువర్గాల వారిని సముదాయించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

## యోగా మాస్టర్‌కు కలెక్టర్ అభినందన

కరీంనగర్ స్పోర్ట్స్, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన యోగా శిక్షకురాలు పుప్పాల మల్లిక ఉత్తమ యోగా మాస్టర్ అవార్డు దక్కించుకుంది. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల ఢిల్లీలో జరిగిన ఏడవ అఖిల భారత సమావేశాలకు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన మల్లిక ఈ అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా బుధవారం కరీంనగర్‌లోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతి ఆమెను అభినందించారు. జాతీయస్థాయిలో ప్రతిభచాటి ఉత్తమ యోగా మాస్టర్ అవార్డును అందుకోవడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి సిద్ధారెడ్డి, యోగా కోచ్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



మల్లికకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

### 14 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 7 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీఏఎల్.) రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు మే 14న ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలకు చెందిన విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

### ఆన్‌లైన్ ద్వారా తలనీలాల టెండర్ నిర్వహణ

వేములవాడ కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి):వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలోని తలనీలాలకు బుధవారం టెండర్‌లను ఆహ్వానించారు. టెండర్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించడంతో దేవాదాయ శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చిన తరువాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఆలయ ఏఈవో శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా టెండర్ నిర్వహిస్తే దానికి సంబంధించిన పూర్తి వివరాలు దేవాదాయ శాఖ కమిషనర్ పరిధిలో ఉంటాయని పేర్కొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 7(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం, కొత్తపల్లి మండలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 6 ట్రాక్టర్లను బుధవారం పట్టుకుని కేసులు నమోదు చేశామని కరీంనగర్ రూరల్, కొత్తపల్లి పోలీసులు తెలిపారు. బద్దిపెల్లి గ్రామంలో 4 ఇసుక ట్రాక్టర్లు, చేగుర్తి గ్రామ శివారులో 2 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు.

## అభాగ్యులకు ఆపన్నహస్తం



నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరకులు అందిస్తున్న యువకులు

### సమాజసేవలో మల్యాల యువకుల ఆదర్శం

హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయం

మల్యాల, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి సహాయం చేయాలనే సదుద్దేశ్యంతో మల్యాలకు చెందిన యువకులు మన నేస్తం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి అనేక మంది అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకుంటూ దాతల సహకారంతో బాధితులకు సహాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మల్యాలకు చెందిన ఆర్మీ ఉద్యోగి కీసర గణేశ్ వ్యవస్థాపకుడిగా 2021లో హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్‌ను స్థాపించి 50మందితో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఈ ఫౌండేషన్‌లో అన్ని వర్గాల యువకులు, ప్రజలను భాగస్వామ్యం చేశారు. ఈ సంస్థలో ఇప్పుడు 600 మంది సభ్యులు ఉండగా అందులో ఆర్మీ ఉద్యోగులు, పోలీసులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, అనేక మంది సామాజిక సేవకులు ఉన్నారు. ప్రతీ నెలా తలా కొంత పోగు చేసుకొని ఎవ రికైనా ఆపద వస్తే ఆదుకుంటున్నారు.

### ● అనేక సేవా కార్యక్రమాలు

ప్రమాదాల్లో గాయపడిన బాధితు లకు, వివిధ కారణాలతో మృతిచెందిన కుటుంబాలకు, నిరుపేద యువతీ యు వకుల వివాహాలకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు నిత్యావసర సరుకులు అంద జేసున్నారు. పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నులు ఇస్తున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు కావాల్సిన సామగ్రిని ఫౌండేషన్ ద్వారా సమకూర్చుతున్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు 30 కుటుంబాలకు ఆర్థిక సహాయం చేశారు.



చికిత్స కోసం సాయం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

### సేవే లక్ష్యంగా ముందుకు


**కీసర గణేశ్, హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు**



ఆపదలో ఉన్నావారిని ఆదుకోవాలనే లక్ష్యంతో మిత్రులతో కలిసి ఈ సంస్థను ఏర్పాటు చేశాం. బాధిత కుటుంబాలకు చేయూత అందిస్తున్నాం. యువకులు, ఉద్యోగులు, మానవతా దృక్పథం కలిగిన చాలా మంది సంస్థలో చేరి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దాతల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడతాం.

### అభాగ్యులకు ఆపన్నహస్తం

**: గుర్రం శ్రీధర్‌గౌడ్, సభ్యుడు**



బాధిత కుటుంబాల పరిస్థితులను వాట్సప్ గ్రూప్‌లో పెట్టడంతో సభ్యుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సభ్యులు తమకు తోచిన మేరకు సాయం అందిస్తున్నారు. సమాజ సేవ చేయాల నుకునే వారంతా ఫౌండేషన్ కార్యక్రమాల్లో పాలు పంచుకోవచ్చు.

## వాసవి మాత ఆలయంలో కుంకుమ పూజలు

సుల్తానాబాద్, మే 7: (ఆంధ్రజ్యోతి): వాసవి మాత జయంతి పురస్కరించుకుని సుల్తానాబాద్ పట్టణంలోని వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారికి అభిషేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు కుంకుమ పూజలు చేశారు. పాల్గొన్న భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ చకిలం మారుతి, వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, కొమురవెల్లి రాంమ్మూర్తి, రాష్ట్ర నాయకుల నగునూరి ఆశోక్, మాడూరి ప్రసాద్, అయితు రమేష్, రాజేంద్ర ప్రసాద్, పల్లా అనిల్, సిరిపురం రమేష్, రామిడి రవీందర్, పల్లా శ్రీనివాస్, బాదం వాణి తదితరులు పాల్గొన్నారు.

**ధర్మారం:** వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక వైశ్య భవన్‌లో సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగింది. అన్నదానం క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సిరిపురం సత్యనారాయణ, పూజా సామగ్రిని జైన రాజమౌళి, స్వీట్స్ బీరెల్లి రాజుకుమార్ సమకూర్చారు. మల్యాల శ్రీనివాస్, శ్రీనివాస్, గుంత సతీష్, కొల్లూరి కిషోర్, ఎలగందుల అశోక్, తాటిపల్లి వంశీ, రాంమోహన్, చెన్న భూమయ్య, రవీందర్, హనుమన్లు, పాల్గొన్నారు.



సుల్తానాబాద్ వాసవి మాత ఆలయంలో కుంకుమ పూజలు

## ఎల్ఆర్ఎస్ గడువు మరోసారి పొడిగింపు

(5వ పేజీ తరువాయి)

కరించుకున్నారు. తద్వారా 25 కోట్ల 27 లక్షల రూపాయల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు జమ అయ్యింది. జిల్లాలో వచ్చిన దరఖాస్తుల్లో పంచాయతీల్లో 5,777 దరఖాస్తులు రాగా, 4,925 దరఖాస్తులకు అధికారులు ఆమోదం తెలపగా, 1243 మంది 3 కోట్ల 66 లక్షల రూపాయల ఫీజు చెల్లించారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో 7,092 దరఖాస్తులకు 4,516 దరఖాస్తులను ఆమోదించగా, 1,425 మంది 8 కోట్ల 11 లక్షల రూపాయల రుసుం చెల్లించారు. మంథని మున్సిపాలిటీలో 904 దరఖాస్తులకుగాను 834 దరఖాస్తులకు ఆమోదం తెలిపారు. 263 మంది 83 లక్షల రూపాయల రుసుం చెల్లించారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో 10,366 దరఖాస్తులకు 7,771 దరఖాస్తులకు ఆమోదం తెలిపారు. 3,128 మంది 11 కోట్ల 68 లక్షల రూపాయల రుసుం చెల్లించారు. సుల్తానా బాద్ మున్సిపాలిటీలో 1,544 దరఖాస్తులకు గాను, 1,248 దరఖాస్తులకు ఆమోదం తెలిపారు. 334 మంది 99లక్షల రూపాయలరుసుం చెల్లించారు.

### ప్రమాదాలు జరుగకుండా విధులు నిర్వహించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు, ఉద్యోగులు

సుల్తానాబాద్, మే 7: (ఆంధ్రజ్యోతి):విద్యుత్ ఉద్యోగులు తగిన జాగ్రత్తలు,రక్షణ చర్యలు పాటిస్తూ ప్రమాద రహితంగా విధులు నిర్వహించాలని హెచ్ఆర్డి వరంగల్ సెక్షన్ చీఫ్ జనరల్ మేనేజర్, ఇంచార్జి డైరక్టర్ బి.అశోక్‌కుమార్ అన్నారు. విద్యుత్ ఉద్యోగుల ప్రమాద వారోత్సవాలను బుధవారం జరుపుకున్నారు. డైరక్టర్ అశోక్‌కుమార్ ఏఈ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం విద్యుత్ వారోత్సవాలకు సంబందించిన అవగాహన సదస్సును నిర్వహించగా అందులో పోస్టర్లను ఆవిష్కరించారు. పలు రక్షణ చర్యలు పాటించే విషయాలకు సంబంధించి అధికారుల సూచనలు చేశారు. డైరక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతు సిబ్బంది తమ విధి నిర్వహణలో భాగంగా సేఫ్టీ బెల్టులు, ఎర్త్ రాడ్, సేఫ్టీ హెల్మెట్ వాడాలని, ప్రమాదాలు జరుగుకుండా ఆవకాశం ఉన్న ప్రతీ అంశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్ఈ (ఆపరేషన్స్) మాధవరావు, ఏడీఈ అడిచెర్ల శ్రీనివాస్, సుల్తానాబాద్, కనుకుల, కాట్నపల్లి ఏఈఈలు కిషోర్, సంపత్,సైపుద్దీన్,దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

రామగిరి, మే 7(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన రిషిత, ప్రత్యూష, మనస్విత, తేజస్వినిలను నాయకులు సన్మానించారు. మాజీ జెడ్‌పీటీసీ గంటవెంకటరమణరెడ్డి, ఉపసర్పంచ్ వెము కనకయ్య, హెడ్ మాస్టర్ శోభన్‌రావు, లయన్స్‌క్లబ్ డైరెక్టర్ మేకల మారుతీ, సత్యనారయణ, పాల్గొన్నారు.

**ముత్తారం, (ఆంధ్రజ్యోతి):** గురుకులంలో సీటు సాధించిన జిల్లాలపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులను బుధవారం మండల విద్యాధికారి హరిప్రసాద్ అభినందించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును సందర్శించారు. గురుకుల ఫలితాలలో సీట్ సాధించిన శ్రీనిధి, రిచిత, రిత్విక్, అరుణ్, అభినాష్, కార్తీక్‌లను, ప్రధానోపాధ్యాయులు రాజేందర్‌లను అభినందించారు. ఖమ్మం పల్లి ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, వలంటీర్ మమత పాల్గొన్నారు.

### క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి

కళ్యాణ్‌నగర్, మే 7(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని కరీంనగర్ దీప్తి క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం గోదావరిఖని జీఎం కాలనీ గ్రౌండ్‌లో ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో పిల్లలకు క్రికెట్‌లో మెళకువలు నేర్పించడానికి 30రోజులు క్యాంపును ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. క్యాంపునకు సుమారు 250మంది హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ సుదేష్ పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య సమరయోధుడు మురళికి నివాళి

సుల్తానాబాద్, మే 7: (ఆంధ్రజ్యోతి): గట్టేపల్లి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు మురళికి గ్రామస్థులు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం మురళి విగ్రహం వద్ద నివాళు ర్పిస్తూ ఆయన సేవలను కొనియడారు. రజాకార్లను ఎదిరించిన వైనాన్ని ఆనాటి పెద్దలు గ్రామస్థులకు వివరించారు. మాజీ సర్పంచ్ దామోదర్ రావు, కోడి కనుకయ్య, బండ శంకర్, బండారి లక్ష్మన్, కృష్ణమూర్తి, సాయబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

### డప్పులు పంపిణీ



డప్పులు అందజేస్తున్న రాజమల్లు, మాజీ ప్రజా ప్రతినిధులు

ఓదెల, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కాసర్ల పోచమ్మ, భూమయ్య దంపతులు అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుమారుడు రాజమల్లు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 15 మంది దళిత బృందానికి రూ.20 వేల విలువైన డప్పులను పంపిణీ చేశారు. డప్పులిచ్చి ఆదుకున్న రాజమల్లు ను దళితులు సన్మానించారు. మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, మాజీ ఎంపీటీసీ బోడకుంట స్వామి, బండారి కుమారస్వామి దళితులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ రిటైర్డ్ హెచ్ఎం మృతి

ఓదెల, మే 7 (ఆంధ్రజ్యోతి) : నాంసానిపల్లికి చెందిన మిట్టపల్లి రాజగోపాల్ (70) బుధవారం కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రాజగోపాల్ నెల 5న కరీంనగర్ లోని ఒక షాపింగ్ మాల్ కు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనలో గాయపడడంతో ప్రయివేటు ఆసుపత్రిలో రెండు రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అక్కడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు నేత్రదానం చేసేందుకు ముందుకు రావడంతో సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేర్గు భీష్మచారి ఆధ్వర్యంలో మృతుడి నేత్రాలను సేకరించారు.

### గీత కార్మికులకు కాటమయ్య కిట్ల పంపిణీ

సుల్తానాబాద్, మే 7: (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు కాటమయ్య కిట్లను ఎమ్మెల్యే విజయరమణారావు పంపిణీ చేశారు. మంగళవారం సుల్తానాబాద్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని గీత కార్మికులకు రక్షణ కిట్లను అందజేశారు. పలు మండలాల నుంచి వచ్చిన గీత కార్మికులు ఎమ్మెల్యే చేతుల మీదుగా కిట్లను అందుకున్నారు.

సుల్తానాబాద్‌లోని పలు గ్రామాలకు చెందిన కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు 62 మందికి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. 152 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సారయ్య గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలుక సతీష్, పట్టణ అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్, మార్కెట్ డైరక్టర్ ఇల్లెందుల శ్రీనివాస్ గౌడ్, నాయకులు సాయిరి మహేందర్, దామోదర్ రావు, శ్రీనివాస రావు, పాల్గొన్నారు.

# ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలి



కాల్వశ్రీరాంపూర్‌లో రిజిస్టర్ పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కాల్వశ్రీరాంపూర్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు, పెద్దరాత్‌పల్లిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా జరగాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తిచేయాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం నిలువచేసి ఉంచకుండా ఎప్పటికప్పుడు కాంటా వేయాలని కలెక్టర్ సూచించారు. రోజు కొనుగోలు కేంద్రాలనుంచి కనీసం 6నుంచి 8 లారీల వరకు లోడ్ రైస్‌మిల్లులకు తరలించాలని, ఎక్కడ హమాలీల, వాహనాల కొరత రాకుండా చూసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలన్నారు. తహసీల్దార్ జగదీశ్వర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఏపీఎం కనకయ్య తదితరులు ఉన్నారు.

**ముత్తారం, (ఆంధ్రజ్యోతి):** కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ముత్తారం, మచ్చుపేట, పారుపల్లి, గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హమాలీల, రవాణా వాహనాల కొరత రాకుండా చూసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద వర్షం కురిస్తే టార్పాలిన్ కవర్లతో ధాన్యం తడవకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ సూచించారు. మండల కేంద్రంలో జరుగుతున్న వరంగల్ - మంచిర్యాల జాతీ య రహదారి పనులను పరిశీలించిన కలెక్టర్ పెండిం గ్‌లో ఉన్న చెల్లింపులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపిడిఓ సురేష్, ఏడిఏ వ్యవసాయ శాఖ అధికారి అంజని, అధికారులు పాల్గొన్నారు.

### పట్టణాభివృద్ధి పనులు పకడ్బందీగా చేపట్టాలి

**పెద్దపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి):** పట్టణ అభివృద్ధి పనులను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. కలెక్టరేట్‌లో పెద్దపల్లిలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద తాగు నీరు, విద్యుత్ సరఫరా పనులు పూర్తి చేశామన్నారు. ప్రతీ ఇంటికి తాగునీటి సరఫరా జరుగుతుందో లేదో పరిశీలించాలని, ప్రతీ ఇంటికి లబ్ధిదారుడి పేరుపై విద్యుత్ మీటర్ ఇవ్వాలని, ఈనెల 20 నాటికి లబ్ధిదారులకు ఇండ్లు అందించేందుకు సన్నద్ధం చేయాలని సూచించారు. అమృత్ 2.0 పథకం కింద 25 కిలోమీటర్ల పైప్‌లైన్, 3 ట్యాంకులు, 2 వేల ఇండ్లకు కనెక్షన్ మంజూరు చేశామని వివరించారు. పట్టణంలో చేపట్టిన సిసి రోడ్డు, డ్రైయిన్ నిర్మాణ పనుల పై నివేదిక అందించాలన్నారు. యేటా కనీసం 6 కోట్ల రూపాయల ఆస్తిపన్ను వసూలు జరిగేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అక్రమ లెఔట్ ఉండవద్దని, అనుమతి కంటే అధికంగా నిర్మించే వారి పై చర్యలు తీసుకోవాలని సూచించారు. తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా సేకరించడంపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

### పాఠశాల అభివృద్ధి పనులను పూర్తిచేయాలి

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ పాఠశాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పకడ్బందీగా పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో టీజీఈడబ్ల్యూఐడీసీ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులు, యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనుల పురోగతి వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మోడల్ స్కూల్స్ గురుకులాలు, జడ్పీ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో టీజీఈడబ్ల్యూఐడీసీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన యంగ్ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. రామగుండం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి పనులు పూర్తిచేయాలని అన్నారు. శాతవాహన విశ్వ విద్యాలయం కింద గోదావరిఖని పీజీ కళాశాలలో చేప ట్టిన అభివృద్ధి పనులకు టెండర్ ఒప్పందం పూర్తి చేసుకొని ఈనెల 20నాటికి పనులు ప్రారంభించాలని అన్నారు. జిల్లా చేపట్టిన చిల్డ్రన్ హోం నిర్మాణంలో పురోగతి లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐటీఐ ఇన్నోవేషన్ పనుల టెండర్లు పూర్తి చేసి 5నెలల వ్యవధిలో పూర్తి చేయాల న్నారు. ఈఈ టీజీఈ డబ్ల్యూఐడీసీ అనితాశింగనాథ్, అధికారులు పాల్గొన్నారు.



పట్టణాభివృద్ధి సమీక్షా సమావేశంలో కలెక్టర్

### మహాచండీ యాగంలో మాజీ మంత్రి కొప్పుల



చండీహోమంలో పాల్గొన్న కొప్పుల ఈశ్వర్ దంపతులు

గోదావరిఖని, మే 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జవహర్‌నగర్ జయదుర్గాదేవి ఆలయం వార్షికోత్సవం సందర్భంగా గురువారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, స్నేహలత దంపతులు మహాచండీ యాగాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈశ్వర్ మాట్లాడుతూ లోక కల్యాణార్థం యేటా చండీయాగాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు అచ్చేవేణు, సట్టు శ్రీనివాస్, మారుతి, ఇరుగురాళ్ల శ్రావణ్ పాల్గొన్నారు.

### ఆర్మీ జవాన్‌కు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, మే 7 ఆంధ్రజ్యోతి): మొట్లపల్లి గ్రామానికి చెందిన దుర్గం శ్రావణ్ అనే ఆర్మీ జవానును మాజీ సర్పంచ్ తుల మనోహర్‌రావు సన్మానించారు. జమ్ములోని రుక్నటి ప్రాంతంలో ఆర్మీ జనరల్ డ్యూటీ విధులు నిర్వహిస్తూ సెలవుపై గ్రామానికి వచ్చిన శ్రావణ్‌ను బుధవారం మాజీ సర్పంచ్ తుల మనోహర్‌రావు సత్కరించి ఆర్మీ విధుల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

### జేఎన్టీయూలో సాంకేతిక ఫెస్ట్ ప్రారంభం



ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్

రామగిరి, మే 7(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సాంకేతిక ఫెస్ట్ ప్రారంభించారు. కళాశాలలో వివిధ ప్రాజెక్టుల పై విద్యార్థులు తయారు చేసిన సాంకేతిక ఫెస్ట్‌ను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఫెస్ట్‌లో తొలి రోజు ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహించారు. వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్, ప్రొఫెసర్ చెరుకు శ్రీధ ర్‌రెడ్డి, లైబ్రరీ ఇంచార్జి రమణ, పరిపాలనాధికారి సుమన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పర్యటన

పాలకుర్తి,మే 7(ఆంధ్రజ్యోతి): పాలకుర్తి మండల మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, జయ్యారం గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవం బుధవారం పుట్నూర్ ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ శుభాకాంక్షాలు తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, నాయకులు మాదాసు శ్రావణ్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి పనులు

అంతర్గాం, మే 7(ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ ఏరియా విలేజీ రామగుండంలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.20లక్షలతో నిర్మించ తలపెట్టిన వాటర్ ప్లాంట్, శ్మశాన వాటిక నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణు గోపాల్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని పేర్కొన్నారు. ఎన్టీపీసీ సంస్థ పరిసర ప్రాంతాల్లో, గ్రామాల్లో అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. వాటర్ ప్లాంట్ నిర్మాణంతో స్థానిక ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నదని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, నాయకులు బొంతల రాజేష్, ఈదునూరి హరి ప్రసాద్, ఎండీ వాజీద్ ఖాన్, పూదరి సత్తయ్యగౌడ్, పల్లికొండ శ్యామ్, సింగం కిరణ్‌గౌడ్, పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, ప్రభుత్వ సలహాదారు హర్కార్ వేణు గోపాల్ రావు

### హెల్మెట్‌తోనే రక్షణ

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయమైతే ప్రాణాలు పోతాయని, హెల్మెట్‌తో ప్రాణాలను కాపాడుకోవచ్చని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో రామగుండం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత హెల్మెట్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్మికులు, ప్రైవేట్ ఉద్యోగులు, ప్రైవేట్ టీచర్లు తదితరులకు ఆయన హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, కుటుంబాల శ్రేయస్సు దృష్ట్యా పోలీసులు కూడా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు కూడా ఇంట్లో నుంచి వాహనాలు తీసే సమయంలోనే హెల్మెట్ అందిం చాలన్నారు. ద్విచక్ర వాహనదారులకు రోజు వారీ జీవితంలో హెల్మెట్ అనేది భాగం చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించడమే కాకుండా సామాజిక బాధ్యతగా మానవతా దృక్పథంతో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు హెల్మెట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. హెల్మెట్ తీసుకు న్న ప్రతి ఒక్కరూ ధరించాలని సూచించారు. అడిషల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఏసీపీ ఎం రమేష్, ట్రాఫిక్ ఏసీపీ జాన్ నర్సింహులు, ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రవీంద్రకుమార్ సింగ్, అమరేందర్, అదర్ సండే సమ్మారావు, పాల్గొన్నారు.

### పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

ఓదెల, మే 7( ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డీఈవో మాధవి అన్నారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో బుధవారం పాఠశాలల బలోపేతం, చేపడుతున్న కార్యక్రమాలపై డీఈవో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై సమీక్షిస్తు పాఠశాలల్లో వేసవి క్యాంపులు, 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షలకు ముందస్తు చర్యలను చేపట్టాలని సూచించారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవన నిర్మాణాలు పూర్తి చేసి రంగులు వేయాలన్నారు. పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిచేసి బడిబాట సమయానికి అన్ని సిద్ధం అయ్యే విధంగా ప్రణాళికలతో ముందుకెళ్లాలని కోరారు. విద్యార్థుల యూనిఫాం కుడుతున్న మహిళా గ్రూపుల సంఘాలను ప్రత్యేకంగా కలిసి పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు 10వ,తరగతి పరీక్షల్లో ఆశించిన మేరకు ఉత్తీర్ణత సాధించడంపై అభినందించారు. ఎంఈఓ రమేష్, క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

### పాకిస్థాన్ జాతీయులు దేశం విడిచి పోవాలి

పాలకుర్తి,మే 7(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ జాతీయులు దేశం విడిచి వెళ్లిపోవాలని బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం మండల బీజేపీ నాయకులు తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైన ఉంటే వారిని గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవా లని వారు డిమాండ్ చేశారు.

### విద్యుత్ వైర్లు తాకి గేదె మృతి

సుల్తానాబాద్, మే 7: (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టేపల్లి గ్రామంలో కొల్లూరి రాజయ్య రైతుకు చెందిన గేదె బుధవారం విద్యుత్ తీగలు తగిలి మృతి చెందినట్లు రైతు తెలిపారు. గాలిదుమారానికి వైర్లు తెగి కిందపడ్డాయి. గేదెను మేతకు వదలగా వైర్లు తాకడంతో అక్కడకక్కడే మృతి చెందినట్లు రైతు తెలిపారు. ఎనభై వేల రూపాయల ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.

### విద్యుత్ వారోత్సవాలు

కాల్వశ్రీరాంపూర్, మే 7 ఆంధ్రజ్యోతి): విద్యుత్ వారోత్సవాల సందర్భంగా బుధవారం విద్యుత్ ఉద్యోగులతో సమావేశం జరిగింది. విద్యుత్ సీఈ (ఆపరేషన్స్) అశోక్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు బాధ్యతతో పనిచేయాలన్నారు. విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించారు.

# ఓసీపీ-5లో డీజిల్ లెక్కల్లో తేడాలు

### విచారణ జరిపిన విజిలెన్స్

గోదావరిఖని, మే 7(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఓసీపీల్లో డీజిల్ అవకతవకలు బయట పడుతూనే ఉన్నాయి. ఇటీవల రవాణాశాఖలో వసూళ్ల బాధ్యతలు చూస్తే ప్రైవేట్ ఉద్యోగి ఒకరు ఓసీ ప్రాజెక్టులో డీజిల్ పోసుకునే విషయంలో జబర్దస్తీ చేయడంతో విజిలెన్స్ విచారణ ప్రారంభించింది. ఓసీపీ-5లో సింగరేణి యాజమాన్యానికి, ఓసీపీ-5 కాంట్రాక్టు కంపెనీ లెక్కలకు మధ్య 40 వేల లీటర్ల తేడా ఉన్నట్టు తెలుస్తుంది. అంటే సుమారు రూ.40లక్షల విలువైన డీజిల్ లెక్కల్లో తేడాలు వచ్చాయని సమాచారం. ముఖ్యంగా రీడింగ్ తీయడంలో సింగరేణి సెక్యూరిటీ విభాగంకు, ఆఫ్ లోడింగ్ కాంట్రాక్టుకు మధ్య పొంతన కుదరడం లేదని సమాచారం. డీజిల్ కొలతలు తీసే చోట లాంగ్ స్టాండింగ్‌గా ఉద్యోగి ఉండడం, లాగ్ బుక్‌లో తేడాలపై అభ్యంతరాలు వ్యక్తం చేసి మొత్తం రీడింగ్ జీరో చేసి కొలతలు తీయాల్సిందిగా ఆదేశించినట్టు సమాచారం. సింగరేణి సంస్థలో యాజమాన్యమే ఓబీ పనులు చేసే కాంట్రాక్టర్లకు డీజిల్ సరఫరా చేస్తుంది. ఓబీ వాహనాలు తిరిగే దూరం(లీడ్), ఉత్పత్తి, వాహనాల యావరేజ్‌ను లెక్కకు తీసుకుని డీజిల్ సరపరా చేస్తారు. బేసిక్ ప్రైజ్‌ను ఈ ఫార్ములా ప్రకారమే లెక్కిస్తారు.

డీజిల్ ఫార్ములను మించి వాడితే పెనాల్టీ కూడా పడుతుంది. ఓసీపీ-5 ఉత్పత్తి అవస రాలకే రోజుకు 70నుంచి 80వేల లీటర్లు, ఒక్కో సం దర్భంలో 1లక్ష లీటర్ల వరకు వినియోగం ఉంటుంది. కం పెనీ బంక్ నుంచి డీజిల్‌ను ఆఫ్ లోడింగ్ కాంట్రాక్టర్లకు వారి బూజర్ ట్యాంకర్లలో పోస్తారు. ఇక్కడే ఓసీపీ-5లో లెక్కలు తేడా వస్తున్నాయి. సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది డిప్‌లతో తీసిన లెక్కలకు, ఆఫ్ లోడింగ్ కాంట్రాక్టు సిబ్బంది తీసిన లెక్కలకు మధ్య రీడింగ్ పొంతన ఉండడం లేదు. సుమారు 40వేల లీటర్ల లెక్కలు తేడా ఉండడంతో విజిలెన్స్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని రీడింగ్ జీఓ తీసుకుని లెక్కలు తీసుకోవాలని ఆదేశించినట్టు తెలుస్తుంది. ఈ తేడాల్లో ఎవరి ప్రమేయం ఉందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత బాధ్యుడైన అధికారిని ఆంధ్రజ్యోతి సంప్రదించగా అంతా బాగనే ఉంది, ఎక్కడా తేడా లేదంటూ వ్యాఖ్యానించారు.

# సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, మే 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నె 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను అమ్మివేస్తుందని, సింగరేణిలో బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. కార్మికుల హక్కులను పెత్తందారులకు దాసోహం చేస్తున్నారని, ఇది సింగరేణి ఉనికికే ప్రమాదమన్నారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేయడానికి యాజమాన్యం చర్యలు చేపట్టిందని, అందులో భాగంగానే బొగ్గు బ్లాకులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడానికి ప్రయత్నాలు చేస్తుందన్నారు. పదవీవిరమణ పొందిన కార్మికుల సిక్, లీవులను యాజమాన్యం అమ్ముకుంటుందని, మారుపేర్ల సమస్యలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని సూచించినా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు సొంత ఇంటి పథకం కింద 250గజాల స్థలాన్ని కేటాయించి వడ్డీ లేకుండా రూ.30లక్షల రుణాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, పొలాడి శ్రీనివాసరావు, చల్లా రవీందర్, రాజేశం, శంకర్, జనగామ మల్లేష్, నూతి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

### సీహెచ్‌పీలో సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

గోదావరిఖని, మే 7(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఓసీపీ-3 సీహెచ్‌పీలో బుధవారం సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు ఉల్లి మొగిలి మాట్లాడారు. కేంద్రంలో ఎన్‌డీఏ మూడవ సారి అధికారంలోకి వచ్చాక 29 లేబర్ చట్టాలను 4 కోడ్‌లుగా సవరించే కుట్ర చేస్తున్నదని, ఈసవరణ ద్వారా కార్మిక హక్కులు దెబ్బతినే ప్రమాదం ఉన్నట్టు తెలిపారు. బొగ్గు పరిశ్రమలో ప్రైవేటీకరణ నిలిపివేయాలని, కమర్షియల్ మైనింగ్ రద్దు చేయాలని మొగిలి డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ద హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ వెంకన్న, భూమయ్య, లక్ష్మీనారాయణ, రాజేష్ పాల్గొన్నారు.

### కంటిన్యూస్ మైనర్ సీ గ్రేడ్ ఆపరేటర్ల ఇంటర్వ్యూ

గోదావరిఖని, మే 7(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియా వకీల్‌పల్లె గనిలో కంటిన్యూస్ మైనర్ యంత్రానికి అర్హతగల్గిన ఉద్యోగులకు సీ గ్రేడ్ ఆపరేటర్ ఎంపికకు బుధవారం అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. గని ఏజంట్ కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూకు అర్హులైన ఇద్దరు ఉద్యోగులు హాజరయ్యారు. ఇంటర్వ్యూను గని ఏజంట్ నెహ్రూ, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, మేనేజర్ రవికిరణ్‌లు నిర్వహించారు.




### మారుపేర్ల సమస్యను పరిష్కరించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మారుపేర్ల సంఘం నాయకులు

గోదావరిఖని, మే 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల కేసులను పరిష్కరించి ఉద్యోగాలు ఇవ్వాలని సింగరేణి మారుపేర్ల సంఘం నాయకులు లక్కం శ్రావణ్‌గౌడ్, వంగ సంతోష్ ఆరోపించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణిలో మారు పేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులు పరిష్కారం కావడం లేదని, ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వస్తువులను అమ్ముకుని జీవనం చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు స్కూల్ ఫీజులు కూడా కట్టలేని స్థితిలోఉన్నామని, ఇప్పటికే ఇద్దరు డిపెండెంట్లు ప్రాణాలు కోల్పోయారని, ఈ నెల 16న నిర్వహిం చే చలో ఇందిరా పార్క్ మహా ధర్నాలో తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ధర్నాకు ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజా ప్రతినిధులు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని కోరారు. శ్రీనివాస్, హరీష్, రంజిత్, రాజయ్య, రిషిబాబు, కొమురమ్మ, పాల్గొన్నారు.